సైక్లింగ్‌లో రెండు పతకాలు

జాతీయ రోడ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: విజయపుర(కర్ణాటక) వేదికగా జరుగుతున్న 28వ జాతీయ రోడ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సైక్లిస్టులు అదరగొట్టారు. శుక్రవారం జరిగిన వేర్వేరు విభాగాల్లో చిరాయుశ్ పట్వర్ధన్, ఆశీర్వాద్ సక్సేనా పతకాలు సాధించారు. బాలుర అండర్-18 80కి.మీల రేసులో చిరాయుశ్ 1:59:27:810 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఇదే విభాగంలో పోటీపడ్డ ఆశీర్వాద్(1:59:27:83సె) కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు. టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన యువ సైక్లిస్టులు చిరాయుశ్, ఆశీర్వాద్‌ను తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఒక ప్రకటనలో అభినందించింది. విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకట నర్సయ్య, దివాకర్‌రావు, పండుజాదవ్..టోర్నీలో తెలంగాణ సైక్లింగ్ టీమ్‌కు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు.

మెయిన్ డ్రాలో నాగల్

మెల్‌బోర్న్: భారత యువ టెన్నిస్ ఆటగాడు సుమీత్ నాగల్.. సీజన్ ఆరంభ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్ మూడో రౌండ్‌లో నాగల్ 6-4, 6-4తో అలెక్స్ మాల్కాన్ (స్లోవేకియా)పై విజయం సాధించాడు. గంటకు పైగా సాగిన పోరులో ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైనా.. ఎక్కడ వెనక్కి తగ్గకుండా నాగల్ అదరగొట్టాడు. దీంతో రెండోసారి ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్ డ్రాలో అడుగుపెట్టాడు. 'గ్రాండ్‌స్లామ్‌కు అర్హత సాధించడం గొప్పగా ఉంది. దీని కోసం ఎంతో కష్టపడ్డా. గాయం నుంచి కోలుకున్న తర్వాత తిరిగి సత్తాచాటడం ఆనందంగా ఉంది' అని మ్యాచ్ అనంతరం నాగల్ అన్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 31వ ర్యాంకర్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)తో 139వ ర్యాంకర్ నాగల్ తలపడనున్నాడు.

దీప్తి పసిడి పరుగు

జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ అథ్లెట్ జివాంజీ దీప్తి మరోమారు తళుక్కుమంది. ఇప్పటికే తనదైన రీతిలో సత్తాచాటుతున్న దీప్తి 22వ జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన మహిళల 400మీటర్ల టీ13/టీ20 విభాగంలో బరిలోకి దిగిన దీప్తి 56.71సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచి స్వర్ణం దక్కించుకుంది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన దీప్తి అనుకున్న ఫలితాన్ని సాధించింది. ఇదే విభాగంలో పూజ(హర్యానా), భారతి(రాజస్థాన్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. స్వర్ణ పతకం సాధించిన దీప్తిని జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్ అభినందించారు.

తెలంగాణ శుభారంభం

జనగామ చౌరస్తా, జనవరి 12: దక్షిణాది రాష్ట్రాల 20వ సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీ శుక్రవారం జనగామలో మొదలయ్యాయి. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారి పోటీలు జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన మహిళల మ్యాచ్‌లో తెలంగాణ 10-0తో తమిళనాడుపై ఘన విజయం సాధించింది. మిగతా మ్యాచ్‌ల్లో కేరళ 10-0తో పాండిచ్చేరిపై, కేరళ 10-0తో కర్ణాటకపై, ఏపీ 10-0తో తమిళనాడుపై, పాండిచ్చేరి 4-3తో కేరళపై, కేరళ 4-0తో కర్ణాటకపై గెలిచి ముందంజ వేశాయి. అంతకు ముందు పోటీలను గోవా మాజీ స్పీకర్ చోడంకర్, జాతీయ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ కార్యదర్శి మౌర్య, సీఈవో ప్రవీణ్ అనూకర్ హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి 224 మంది ప్లేయర్లతో పాటు 28 కోచ్‌లు పాల్గొంటున్నట్లు జిల్లా సెక్రెటరీ భగత్ పేర్కొన్నారు.

రోహిత్, చందన్ మెరుపులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జోరు కొనసాగుతున్నది. ప్లేట్ గ్రూప్ తొలి పోరులో అలవోక విజయం సాధించిన హైదరాబాద్.. శుక్రవారం మేఘాలయతో మ్యాచ్‌లోనూ సత్తాచాటింది. మన బౌలర్ల ధాటికి మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే ఆలౌటైంది. సాయిరామ్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్.. ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. రోహిత్ రాయుడు (54 నాటౌట్), చందన్ సహానీ (52) అర్ధశతకాలు సాధించారు.

స్వర్ణం, రజతం మనదే

జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీపురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో భారత స్టార్ షూటర్లు స్వర్ణ, రజతాలు దక్కించుకున్నారు. 460 పాయింట్లతో అఖిల్ షెరాన్ పసిడి పతకం గెలుచుకోగా.. ఇదే విభాగంలో టోక్యో ఒలింపియన్ ఐశ్వరి ప్రతాప్ సింగ్ తోమర్ 459 పాయింట్లతో రజతం కైవసం చేసుకున్నాడు. ఈ చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు మన షూటర్లు 24 పతకాలు నెగ్గారు. అందులో 10 స్వర్ణాలు, 8 రజతాలు, 6 కాంస్యాలు ఉన్నాయి.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

మలేషియా ఓపెన్

అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శన కొనసాగిస్తున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ.. తాజా సీజన్‌లో కూడా అదే దూకుడు కొనసాగిస్తున్నది. ఈ ఏడాది బరిలోకి దిగిన తొలి టోర్నీ మలేషియా ఓపెన్‌లో సాత్విక్ జంట సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇటీవల దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు గెలుచుకున్న ఈ ద్వయం.. ఒక్క గేమ్ కోల్పోకుండా.. సెమీస్‌లో అడుగుపెట్టింది.

కౌలాలాంపూర్: పారిస్ ఒలింపిక్స్ సమీపిస్తున్న తరుణంలో స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సత్తాచాటింది. ఇతర భారత షట్లర్లంతా చేతులెత్తేసిన చోట సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అదరగొట్టారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ -1000 టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో శుక్రవారం సాత్విక్-చిరాగ్ ద్వయం 21-11, 21-8తో రెన్ జియాంగ్-హె జీ టింగ్ (చైనా) జంటపై విజయం సాధించింది. ప్రపంచ రెండో ర్యాంక్‌లో ఉన్న భారత షట్లర్లకు 32వ ప్లేస్‌లో ఉన్న చైనా ప్లేయర్లు కనీస పోటీనివ్వలేకపోయారు. అరగంటలోనే ముగిసిన పోరులో భారత ఆటగాళ్లు వరుస గేమ్‌ల్లో విజృంభించారు. నిరుడు ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధించిన ఈ ద్వయం.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయింది. శనివారం జరగనున్న సెమీఫైనల్లో కాంగ్ మిన్ హ్యూక్-సియో సెవాంగ్ (కొరియా) జంటతో సాత్విక్-చిరాగ్ తలపడనున్నారు. నిరుడు ఆరు టైటిల్స్‌తో అదరగొట్టిన సాత్విక్ జోడీ.. ఒలింపిక్స్ పతకం పట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో మనవాళ్లు లాంగ్ ర్యాలీలతో పాటు మెరుపు షాట్లు, నెట్‌గేమ్‌తో విజృంభించారు.

అశ్విని జంటకు నిరాశ

మరోవైపు మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టి ఆశలు రేపిన అశ్విని పొన్నప్ప-తనీషా జంట పోరాటం ముగిసింది. శుక్రవారం క్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా జోడీ 15-21, 13-21తో రిన్ ఇవాంగా-కై నకాన్షి (జపాన్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. గత మ్యాచ్‌లో మాజీ ప్రపంచ చాంపియన్‌లను మట్టికరిపించిన మన అమ్మాయిలు.. అదే దూకుడు కొనసాగించలేక ఇంటి బాట పట్టారు.

జురెల్‌కు చోటు

ఇంగ్లండ్‌తో టెస్టులకు ఎంపిక

ముంబై: ఇంగ్లండ్‌తో జరుగనున్న తొలి రెండు టెస్టుల కోసం భారత క్రికెట్ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. ఓవైపు సీనియర్లను కొనసాగిస్తూనే యువ వికెట్‌కీపర్, బ్యాటర్ ధృవ్ జురెల్‌కు సెలెక్షన్ కమిటీ అవకాశం కల్పించింది. గత సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ప్రాతినిధ్యం వహించిన 22 ఏండ్ల జురెల్ మిడిలార్డర్‌లో దూకుడుగా ఆడటంలో సిద్ధహస్తుడు. రంజీ మ్యాచ్‌లో గాయపడ్డ యువ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణకు జట్టులో చోటు దక్కించుకోలేదు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఈ నెల 25 నుంచి హైదరాబాద్‌లో తొలి టెస్టు జరుగనుంది.

ఫార్ములా-ఈలో జెహాన్

ముంబై: ప్రతిష్ఠాత్మక ఫార్ములా-ఈ చాంపియన్‌షిప్‌లో భారత యువ రేసర్ జెహాన్ దారువాలా అరంగేట్రం చేయబోతున్నాడు. ఫార్ములా రేసింగ్ సర్క్యూట్‌లో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జెహాన్ శనివారం మొదలవుతున్న ఫార్ములా-ఈ 10వ సీజన్ తొలి రేసు మెక్సికోలో బరిలోకి దిగబోతున్నాడు. మాసరెటి ఎమ్‌ఎస్‌జీ టీమ్ తరపున జెహాన్ ప్రాతినిధం వహించబోతున్నాడు. ఇప్పటి వరకు ఫార్ములా-2లో కొనసాగిన ఈ 25 ఏండ్ల యువ రేసర్ ఫార్ములా-ఈ రేసింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. మాక్సిమిలాన్ గుంటర్‌తో కలిసి జెహాన్..మాసరెటి కారును నడిపించనున్నాడు.

2025లో భారత్‌లో ఫార్ములా-ఈ

ఫార్ములా-ఈ రేసింగ్ చాంపియన్‌షిప్ 2025లో భారత్‌లో జరిగే అవకాశముందని కో ఫౌండర్ అల్బర్టో లాంగో పేర్కొన్నాడు. భారత్‌లోని నగరాల ఆతిథ్యంపై చర్చిస్తున్నామని తెలిపాడు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పందాన్ని కొనసాగించకపోవడంతో హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ రద్దయిన సంగతి తెలిసిందే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.